క్లుప్తంగా

మండలంలో 16.4 మి.మీ. వర్షపాతం

దుగ్గిరాల: దుగ్గిరాల మండలంలో మంగళవారం రాత్రి ఓ మోస్తరు వర్షం కురిసింది. మండలంలో 16.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయ్యిందని దుగ్గిరాల తాహసీల్దార్ కార్యాలయం నుంచి అధికారులు వర్షమాపిని ద్వారా నమోదైన వివరాలను బుధవారం వెల్లడించారు.

నేటి నుంచి నట్టల నివారణ మందులు పంపిణీ

తాడికొండ: గొర్రెలు, మేకల్లో నట్టల నివారణ కార్యక్రమంలో భాగంగా గురువారం నుంచి తాడికొండ నియోజకవర్గంలో నట్టల నివారణ మందులు పంపిణీ చేస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ ఏడీ వై.రాయప్పరెడ్డి బుధవారం తెలిపారు. జులై 10వ తేదీ వరకూ నిర్వహించనున్న కార్యక్రమాలలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోని పశు వైద్యశాలల్లో ఉచితంగా నట్టల నివారణ మందులు వేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పశువుల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వృద్ధురాలి బ్యాగ్‌లో నగదు మాయం

తాడేపల్లి రూరల్: ఓ వృద్ధురాలి బ్యాగ్‌లో నగదు మాయమైన సంఘటనపై బుధవారం తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు అందింది. వృద్ధురాలు కోటేశ్వరమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. మహానాడులో నివాసం ఉండే ఆమె నడుచుకుంటూ మణిపాల్ సెంటర్ వద్దకు వెళ్లారు. మంగళగిరిలోని లక్ష్మీనరసింహస్వామి కాలనీకి వెళ్లేందుకు ఆటో ఎక్కారు. తన మనుమరాలు పెళ్లి నిమిత్తం రూ.50 వేల నగదు తన బ్యాగ్‌లో పెట్టుకుని బంధువుల ఇంటికి వెళుతున్నారు. ఇద్దరు ఉన్న ఆటోలో ఆమె ఎక్కగా.. ఆటోలో మార్గం మధ్యలో మరో ఇద్దరు ఎక్కారు. ఆటో దిగగా బ్యాగ్‌లోని నగదు మాయమైంది. నలుగురిలో నగదు ఎవరో తీసి ఉంటారని.. పోలీసులు వృద్ధురాలు ఎక్కిన ఆటో వివరాలు సేకరిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

తాడికొండ: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన తుళ్లూరు మండలం లింగాయపాలెంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగాయపాలెం సమీపంలో సీఆర్‌డీఏ కార్యాలయం ఎదుట ఈ ప్రమాదం జరిగింది. విజయనగరం జిల్లాకు చెందిన గణేష్ (35) అనే వ్యక్తి నడుచుకుంటూ వస్తుండగా వెనుక నుంచి బొలేరో వాహనం ఢీకొంది. ప్రమాదంలో గణేష్ తీవ్రగాయాల పాలయ్యాడు. గమనించిన స్థానికులు వెంటనే మంగళగిరి ఏయిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తుళ్లూరు పోలీసులు తెలిపారు.

సేవానిరతితో మానవజన్మ చరితార్థం

గాంధీ హృదయదారి వజ్రాల రామలింగాచారి



తెనాలిటౌన్: సేవానిరతితో మానవజన్మ చరితార్థమవుతుందని గాంధీ హృదయదారి వజ్రాల రామలింగాచారి పేర్కొన్నారు. బుర్రిపాలెం రోడ్డులోని శ్రీ మహాత్మా సేవా శాంతి ఆశ్రమంలో బుధవారం వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. ఆశ్రమ ధర్మదాత డాక్టర్ చిలుకూరి రేఖ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు సేవా కార్యక్రమం నిర్వహించారు. అదే విధంగా దుగ్గిరాల మండలం మంచికలపూడి గ్రామానికి చెందిన మంచికలపూడి రాఘవులు, మహాలక్ష్మి జ్ఞాపకార్థం వారి కుమారుడు వెంకటేశ్వర రావు, కోడలు విజయ వృద్ధులకు సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు రామలింగాచారి మాట్లాడుతూ ధర్మదాతలు కోరిన విధంగా అమావాస్య రోజు వృద్ధులకు భోజనం ఏర్పాటు చేయడం వంటి సేవా కార్యక్రమాలకు ఆదర్శంగా ఆశ్రమ నిలుస్తుందని చెప్పారు. కార్యక్రమంలో వై.కోటేశ్వర రావు, ఆశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యభిచార నిర్వాహకుల అరెస్ట్

తెనాలిరూరల్: తెనాలి మండలం మల్లెపాడు గ్రామంలో వ్యభిచారం నిర్వహిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. నర్సరావుపేటకు చెందిన ఓ మహిళను రక్షించి, విటుడిపైన కేసు నమోదు చేశారు. త్రీ టౌన్ సీఐ ఎస్. రమేష్ బాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మల్లెపాడు పరిధిలోని ద్వారకానగర్‌లోని ఓ ఇంట్లో వ్యభిచారం జరుగుతోందన్న సమాచారంతో పోలీసులు బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. బాపట్ల జిల్లా అమృతలూరు మండలం పెదపూడికి చెందిన వ్యక్తి, తెనాలి ముత్తెంశెట్టిపాలెంకు చెందిన ఓ మహిళ ఇల్లు అద్దెకు తీసుకుని వ్యభిచారం నిర్వహిస్తున్నట్టు గుర్తించారు. నర్సరావుపేటకు చెందిన మహిళ, తెనాలికి చెందిన విటుడిని అదుపులోకి తీసుకున్నారు. వీరిని కోర్టులో హాజరుపరచున్నట్టు సీఐ తెలిపారు.

నిడమర్రు జెడ్పీ స్కూలుకు మహర్దశ

- రూ.11 కోట్లతో రాష్ట్రానికే మోడల్ స్కూలుగా అభివృద్ధి
- లీప్ కోవెల పేరుతో నిర్మాణం
- 1 నుంచి 12వ తరగతుల వరకు ఏర్పాటు



శరవేగంగా కొనసాగుతున్న నిర్మాణ పనులు

నిడమర్రు(మంగళగిరి): మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ (ఎంటీఎంసీ) పరిధిలోని నిడమర్రులో జిల్లా ఉన్నత పాఠశాలకు మహర్దశ పట్టింది. లీప్ కోవెల (లెర్నింగ్, ఎక్సలెన్స్ ఇన్ ఏపీ) పేరుతో రాష్ట్రానికే మోడల్ స్కూలుగా అభివృద్ధి పరిచేలా చర్యలు తీసుకుంటున్నారు. రూ.11 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. పాఠశాల స్థలం 5.2 ఎకరాల విస్తీర్ణం ఉండడంతో మోడల్ స్కూలుగా అభివృద్ధి పరిచేందుకు అన్ని విధాల అనుకూలంగా ఉంటుందని విద్యాశాఖ అధికారులు నిర్ణయం తీసుకుని పనులు చేపట్టారు. 5.2 ఎకరాలలో రూ.11 కోట్లతో అత్యాధునిక వసతులతో నిర్మాణం చేపట్టారు.

1వ తరగతి నుంచి 10వ తరగతితో పాటు ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలను కూడా ప్రారంభించారు. గతేడాది 420 మంది విద్యార్థులు పాఠశాలలో ఉండగా.. ఆ సంఖ్య ఈ ఏడాది ఇప్పటి వరకూ 550కి పెరిగింది. అడ్మిషన్లు ప్రస్తుతం జరుగుతున్నాయని.. మరిన్ని అడ్మిషన్లు పెరిగే అవకాశముందని అధికారులు తెలిపారు.

విశాలమైన క్రీడా మైదానం..

అదనపు గదులతో పాటు క్రీడా మైదాన నిర్మాణం, ఆట వస్తువులు ఏర్పాటు, బ్యాట్‌మెంట కోర్టు, వాలీబాల్ కోర్టు, కబడ్డీ, ఖోఖోలతో అన్ని ఆటలను పిల్లలు ఆడుకునేందుకు అభివృద్ధి పరుస్తున్నారు. నిడమర్రుతో పాటు కురగల్లు, నీరుకొండ, ఐనవోలు, మంగళగిరి నుంచి అడ్మిషన్లు తీసుకుంటున్నారు. అత్యాధునిక మోడల్‌తో భవన నిర్మాణాలతో పాటు క్రీడా మైదానం విశాలంగా ఉండడంతో తల్లిదండ్రులు అధిక సంఖ్యలో తమ పిల్లలను చేర్పిస్తున్నారు. రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచేలా అభివృద్ధి పనులు సాగుతుండగా అదే స్థాయిలో అడ్మిషన్లు జరుగుతుండడం విశేషం.



లీప్ కోవెల మోడల్ చిత్రం

ప్రజలను మోసం చేస్తున్న మోదీ

మంగళగిరి టౌన్: కేంద్రంలోని నరేంద్ర మోదీ పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలను మోసం చేస్తున్నారని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య అన్నారు. బుధవారం మంగళగిరి పట్టణ పరిధిలోని పార్టీ కార్యాలయంలో శాఖా మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్తులను తమ మిత్రులైన ఆదాని, అంబానీలకు దోచిపెడుతున్నారని, కార్మిక రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నారని విమర్శించారు. సామాన్య ప్రజల పక్షాన నిరంతరం పోరాటం చేయడంలో ఎర్రజెండా ముందుంటుందని అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గోలి వెంకటేశ్వరరావు, నియోజకవర్గ కార్యదర్శి కంచర్ల కాశయ్య, పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్, పట్టణ సహాయ కార్యదర్శి నందం బ్రహ్మేశ్వరరావు, జొన్నాదుల భారతి, పద్మ, ఉడత శ్రీనివాసరావు, వీరాంజనేయులు, సాంబయ్య, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

చలో తెనాలి కరపత్రాలు పంపిణీ

తాడేపల్లి రూరల్: తెనాలిలో దళిత, మైనార్టీ యువకులపై పోలీసులు జరిపిన అరాచకాన్ని నిరసిస్తూ ఈనెల 28న జరిగే చలో తెనాలి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం తాడేపల్లి మండల నాయకులు పల్లెకృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లిలో కరపత్రాలు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెనాలిలో ఘటనలో చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సిన పోలీసులే బహిరంగ ప్రదేశంలో లాఠీలు విరిగేలా కొట్టడం చట్టరీత్యా నేరమని అన్నారు. ఈ అమానుషాన్ని ఖండించాలని కోరుతూ శనివారం తెనాలిలో జరిగే మానవ హక్కుల పరిరక్షణ సదస్సుకు మానవతావాదులు, దళితులు కదలిరావాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు అమ్మిశెట్టి రంగారావు, నల్లపు లెనిన్, దానియేలు, బిరుదుగడ్డ నరసింహారావు, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలపై కమిషనర్‌కు వినతి

తాడేపల్లి రూరల్: ఉండవల్లి బాపనయ్య నగర్‌లో ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా బుధవారం విస్తృతంగా పర్యటించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ సరిగా లేక మురుగు పారడం లేదని ఆయన దృష్టికి స్థానికులు తీసుకువచ్చారు. స్పీడ్ బ్రేకర్లు వేయడంతో నీరు నిలిచి పోతోందని ఆయనకు తెలిపారు. వీధి దీపాలు వెలగడం లేదని చెప్పడంతో సాయంత్రానికి వీధి లైట్లను ఏర్పాటు చేయించారు. చెత్తాచెదారాలను రోడ్లపై వేయవద్దని ఆయన ప్రజలకు సూచించారు. సాయినగర్, బాపనయ్య నగర్ ప్రజలు తెలిపిన సమస్యలను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.



ప్రజల నుంచి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కమిషనర్ అలీమ్‌బాషా

దారి తప్పి వచ్చిన బాలిక

పోలీసులకు అప్పగించిన యువకుడు



తాడేపల్లి రూరల్ : మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని 16వ నంబరు జాతీయ రహదారిపై బుధవారం ఓ బాలిక అటు ఇటు తిరుగుతుండటంతో రోడ్డుపై ప్రయాణించే ఓ యువకుడు గమనించి, ద్విచక్ర వాహనంపై తీసుకువచ్చి బుధవారం తాడేపల్లి పోలీసులకు అప్పగించాడు. అడ్రస్ చెప్పలేకపోవడంతో అప్పగించాడని, ఆ పాప ఎవరనేది విచారణ చేస్తున్నామని ఎస్ఐ ప్రతాప్ తెలిపారు. మతిస్థిమితం లేదని, పేరు హంసిని అని మాత్రమే చెబుతోందన్నారు. జోలాస్‌నగర్‌లోని మేరీ హోమ్స్ సంరక్షణలో ఉంచామని చెప్పారు. పాపకు తల్లిదండ్రులు లేరని చెబుతోందని, అమ్మమ్మ, తాతయ్య ఉన్నారని, అయితే వాళ్ల పేర్లు, ఊరు చెప్పలేకపోతోందన్నారు. ఎవరైనా ఈ పాపను గుర్తిస్తే తాడేపల్లి పోలీసులను కలవాలని ఆయన కోరారు.

భక్తులకు అన్నప్రసాద వితరణ

తాడేపల్లి రూరల్: మంగళగిరి శ్రీ పానకాల లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు మాట్లాడుతూ.. మంగళగిరి పుణ్య క్షేత్రంలోని దేవాలయాల దర్శనార్థం విచ్చేసే సుమారు 2,500 మంది భక్తులకు అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని 40 మంది దాతల సహకారంతో అన్నదానం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు నంగళం ప్రసాద్, కర్నాటి శివసత్యనారాయణ, దుంపల సోములు, పెరుమాళ్ల సుబ్రహ్మణ్యం, పంచల శివన్నారాయణ, మల్లిఖార్జునరావు, వాసు, రంగారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



భక్తులకు అన్నప్రసాదం అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

కిడ్నీ రాకెట్ ముఠా సభ్యుల అరెస్ట్

- కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ చేయిస్తామని కోదాడకు చెందిన వ్యక్తి నుంచి
- డబ్బులు వసూలు చేసి పరారీ
- విజయవాడ నోవాటెల్ హోటల్‌లో ఆరుగురిని అరెస్ట్ చేసిన కోదాడ పట్టణ పోలీసులు
- పరారీలో మరో నలుగురు

కోదాడరూరల్: విజయవాడ కేంద్రంగా కొనసాగుతున్న కిడ్నీ రాకెట్ ముఠాను సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఈ కేసు వివరాలను కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి బుధవారం తన కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడకు చెందిన కడుపూరి తాతారావు, ఎన్టీఆర్ జిల్లా భవానీపురానికి చెందిన కొండం రమాదేవి, విజయవాడకు చెందిన బొందిలి పృథ్వీరాజ్, గుంటూరు జిల్లా దుగ్గిరాలకు చెందిన కొడాలి బాబురావు, కందుకూరి విష్ణువర్ధన్‌బాబు, విజయవాడకు చెందిన మహ్మద్ సర్దార్‌తో పాటు మరో నలుగురు ముఠాగా ఏర్పడ్డారు. వీరు కిడ్నీ ఆస్పత్రులు, డయాలసిస్ సెంటర్ల చుట్టూ తిరుగుతూ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న పేషెంట్లను గుర్తించి వారితో పరిచయం పెంచుకుంటారు. కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ చేయించేందుకు డోనర్‌తో మాట్లాడామని కిడ్నీ వ్యాధిగ్రస్తులతో చెబుతారు. వారిని నమ్మించేందుకు నకిలీ క్లియరెన్స్ సర్టిఫికెట్లు, రక్త పరీక్షలకు సంబంధించిన పత్రాలు కూడా సృష్టించి.. కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ చేసేందుకు రూ.లక్షల్లో ఫీజు అవుతుందని, ఆస్పత్రిలో డబ్బులు కట్టాలని చెప్పి బాధితుల నుంచి డబ్బులు వసూలు చేసి ఆపరేషన్ చేయించకుండా తప్పించుకుని తిరుగుతున్నారు. ఈ విధంగా వారు పది మందిని మోసం చేశారు.

కోదాడకు చెందిన వ్యక్తి నుంచి రూ.22లక్షలు వసూలు..

కోదాడ పట్టణ పరిధిలోని శ్రీరంగాపురానికి చెందిన నరేష్ కిడ్నీ వ్యాధితో బాధపడుతూ విజయవాడలో చికిత్స పొందుతున్నాడు. అతడికి ఈ ముఠా గతేడాది డిసెంబర్‌లో పరిచయమై.. కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ చేయిస్తామని, ఆపరేషన్‌కు రూ.22లక్షలు ఖర్చవుతాయని చెప్పారు. నరేష్ నుంచి రూ.22 లక్షలు వసూలు చేసి ఆస్పత్రిలో డబ్బులు కట్టకుండా పరారయ్యారు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన నరేష్ స్వయంగా ఆస్పత్రిలో డబ్బులు చెల్లించి కిడ్నీ ఆపరేషన్ చేయించుకున్నాడు. ఇటీవల అతడి ఆరోగ్యం కుదుటపడటంతో వారం కిందట కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా కిడ్నీ రాకెట్ ముఠాలోని ఆరుగురిని కోదాడ పట్టణ పోలీసులు బుధవారం విజయవాడలోని నోవాటెల్‌లో అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నారు. పట్టుబడిన ఆరుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని, మరో నలుగురు పరారీలో ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. వారి నుంచి ఏడు సెల్‌ఫోన్లు, ఆరు రబ్బర్ స్టాంపులు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితులను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన సీసీఎస్ సీఐ శివకుమార్, కోదాడ పట్టణ సీఐ శివశంకర్, ఎస్ఐ సుధీర్‌కుమార్, పోలీస్ సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



తెనాలిరూరల్: మండల పరిధిలోని పెదరావూరు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు రోటరీ క్లబ్ తెనాలి వైకుంఠపురం, ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ సంయుక్తంగా నేత్ర సంబంధిత క్యాంపును బుధవారం ఏర్పాటు చేశారు. పాఠశాలలోని 350 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. అలానే విద్యార్థులకు నోటు పుస్తకాలు, పాఠశాలు కుర్చీలను అందజేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షులు ఈదర శ్రీనివాసరావు, పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షులు ఈదర వెంకట పూర్ణ చంద్, పాలడుగు సురేంద్ర, జగన్, స్కూల్ కమిటీ చైర్మన్ వేణు, రోటరీ సభ్యులు మల్లాది అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

వరి విత్తనాలు వినియోగించుకోవాలి

తెనాలిటౌన్: ప్రభుత్వం సబ్సిడీపై రైతు సేవా కేంద్రాల ద్వారా ఇచ్చే వరి విత్తనాలను రైతులు వినియోగించుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.సుధీర్‌బాబు సూచించారు. రూరల్ మండలం నందివెలుగు గ్రామంలో బుధవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సభలో వ్యవసాయాధికారి సుధీర్‌బాబు మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద వరి, మినుము పంటలకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని తెలియజేశారు.

మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు

ఇన్‌చార్జ్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు



తెనాలిఅర్బన్: పట్టణంలో మురుగు సమస్య పరిష్కారానికి చర్య తీసుకుంటామని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు పేర్కొన్నారు. పట్టణంలోని పలు వార్డులలో బుధవారం ఆయన పర్యటించారు. ఆ ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరచూ వర్షాలు పడుతున్న నేపథ్యంలో రోడ్లపై ఎక్కడ నీరు నిలబడకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాల్వల్లో పూడికతీత పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు విద్యార్థుల ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు



ఎంపికైన క్రీడాకారులు

తాడేపల్లి రూరల్: రాష్ట్రస్థాయిలో జరుగనున్న రగ్బీ పోటీలకు వడ్డేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.సుబ్బారావు మాట్లాడుతూ.. గుంటూరు జిల్లా రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం పాఠశాలలో గుంటూరు జిల్లా రగ్బీ పోటీలు నిర్వహించారని అన్నారు. తమ పాఠశాల విద్యార్థులు యస్‌కే బాజీ (9వ తరగతి), కె.ప్రియదుర్గ (9వ తరగతి), డి.సాహితి (9వ తరగతి) అండర్-18 రగ్బీ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలు ఈనెల 28, 29 తేదీల్లో కర్నూలులో జరుగనున్నాయని వివరించారు. విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంతో ఉపాధ్యాయులు జోజప్ప, ఎం.రవి, ఎస్.రవి, పీడీఎస్ శ్రీరామచంద్రారెడ్డి, చావ శ్రీనివాసరావు, టి.శ్రీనివాసరావు తదితరులు విద్యార్థులను అభినందించారు.

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని నూతక్కి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా రగ్బీ అసోషియేషన్ ఆధ్వర్యంలో బుధవారం సమావేశం నిర్వహించారు. అండర్-18 బాల బాలికలకు రగ్బీ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను ఎంపిక చేశారు. పోటీలలో రాణించిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో కర్నూలులో జరుగనున్న పోటీలలో పాల్గొంటారని పీడీఎస్ రవి తెలిపారు.

కళాశాలలో వసతుల తనిఖీ

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని ఇమ్మి కళాశాలలో తగిన వసతులు లేవంటూ విద్యార్థులు గత రెండు రోజులుగా వివిధ శాఖల అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. కాగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి బుధవారం కళాశాలను తనిఖీ చేశారు. ల్యాబ్, క్లాసు రూములు, విశ్రాంతి గదులను ఆమె పరిశీలించారు. ఒక్కొక్క విద్యార్థితో కళాశాలలో వసతులు, పడుతున్న ఇబ్బందులను గురించి అడిగి తెలుసుకున్నారు. విజయలక్ష్మి మాట్లాడుతూ.. విద్యార్థులను అడిగి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నామని చెప్పారు. తాగునీరు, గదుల్లో శుభ్రత, శానిటేషన్ సరిగా ఉండకపోవడాన్ని గుర్తించినట్లు తెలిపారు. భోజనం సరిగా ఉండడం లేదని, ఇంటికి వెళ్లి తిరిగివచ్చిన వారికి ఆలస్యానికి అపరాధ రుసుము వసూలు చేస్తున్నారన్నారు. 300 మందికి విద్యార్థులకు ముగ్గురు ఫ్యాకల్టీలు మాత్రమే ఉన్నారని చెప్పారు. అన్ని విషయాలను నమోదు చేసి జిల్లా కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. ఆమె వెంట వైద్యాధికారి శ్వేత, సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, సూపర్ వైజర్ షేక్. అబ్దుల్ రెహమాన్, కార్యాలయం సిబ్బంది ఉన్నారు.



విద్యార్థులను వివరాలు అడుగుతున్న విజయలక్ష్మి

కార్మికుల సమస్యను విస్మరించిన ప్రభుత్వం

తాడేపల్లి రూరల్: 32 ఏళ్లుగా ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్య పరిష్కారం కాలేదని సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు అన్నారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలు బుధవారంతో 204వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా దుర్గారావు, యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్‌లు దీక్షా శిబిరాన్ని సందర్శించి కార్మికులకు మద్దతు తెలియజేసి మాట్లాడారు. ప్రభుత్వం కార్మికుల సమస్యను విస్మరించిందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆశీర్వాదం, బి.సూర్యప్రకాశరావు, ఇస్మాయిల్, సుభాని, నాగేశ్వరరావు, కార్మికులు హగ్గయ్య, శారద, రమణమ్మ, సువర్ణకుమారి, కాసమ్మ తదితరులు పాల్గొన్నారు.



కార్మికులకు మద్దతు తెలియజేస్తున్న నాయకులు

డ్రగ్స్ నియంత్రణపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై వెంకటరవి



మాట్లాడుతున్న సీఐ నాగూర్ మీరా సాహెబ్

దుగ్గిరాల: రేవేంద్రపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం డ్రగ్స్ నియంత్రణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్ఎంబీఏ మాసోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమానికి దుగ్గిరాల ఎస్సై యస్.వెంకట రవి ముఖ్యఅతిథిగా హాజరైయ్యారు. విద్యార్థులకు మాదక ద్రవ్యాలు, డ్రగ్స్ నియంత్రణపై ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మేడికొండూరు: మాదక ద్రవ్యాలు లేని సమాజ స్థాపన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మేడికొండూరు సీఐ ఎస్‌కే నాగూర్ మీరా సాహెబ్ అన్నారు. పేరేచర్ల జంక్షన్‌లో బుధవారం యాంటీ డ్రగ్స్‌పై యువత, విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. నిషేధిత మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితాలు చిన్నాభిన్నమవుతాయని సూచించారు. ప్రతి విద్యార్థి, యువత మంచి అలవాట్లు నేర్చుకోవాలని సూచించారు. డ్రగ్స్ క్రయవిక్రయాలు నేరమన్నారు. కార్యక్రమంలో ఎన్నారై ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, విశ్వభారతి ఫార్మసీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

28న తెనాలిలో మానవ హక్కుల పరిరక్షణ సదస్సు

తెనాలి: తెనాలిలో పోలీసుల మానవ హక్కుల ఉల్లంఘనను నిలదీస్తూ ఈనెల 28న సాయంత్రం నాలుగు గంటలకు అయితానగర్లోని శ్రీపాట్టి శ్రీరాములు కమ్యూనిటీ హాలులో జరగనున్న మానవ హక్కుల పరిరక్షణ సదస్సును జయప్రదం చేయాలని దళిత, ప్రజాసంఘాల నేతలు కోరారు. సంబంధిత కరపత్రాన్ని బుధవారం సాయంత్రం ఆవిష్కరించారు. దళిత, మైనారిటీ యువకులపై పోలీసులు బహిరంగ ప్రదేశాల్లో అరికాళ్లపై లాఠీలు విరిగేలా అమానుషంగా దాడిచేసిన ఘటనపై హైకోర్టు సిటింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. చట్ట ఉల్లంఘనకు పాల్పడిన తెనాలి సీఐలు రాముల నాయక్, రమేష్‌బాబు, సిబ్బందిపై కేసులు నమోదుచేసి, వెంటనే అరెస్టు చేయాలని కోరారు. ప్రముఖ న్యాయవాది పిల్లి పాల్ రవీంద్ర విద్యాసాగర్, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, రైతు సంఘ నాయకుడు ములకా శివసాంబిరెడ్డి, అంబేద్కరిస్టు రాయిపూడి వెంకటేశ్వరరావు, ప్రగతిశీల కార్మిక సంఘం సమైక్య సభ్యుడు నన్నం పోతురాజు, ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి యండ్రపాటి అశోక్ కుమార్, సామాజిక న్యాయవేదిక రాష్ట్ర అధ్యక్షుడు పేరూరి మురళి కుమార్, మాల మహానాడు రాష్ట్ర నాయకులు గడ్డటి సుందర్ సునీల్ కుమార్, తుమ్మల ఫ్రాన్సిస్‌రాజు, జాన్ విక్టర్ తండ్రి చేబ్రోలు ఇశ్రాయేలు, దోమ రాకేష్ తండ్రి దోమ వాసు, మాల మహానాడు సోహన్ లాల్, జాకబ్ పాల్గొన్నారు.



కరపత్రం ఆవిష్కరణలో దళిత, ప్రజాసంఘాల నాయకులు